RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:202 ఆదివారం 22 ఆగస్టు 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098



## రేవంత్ అమెరికా పర్యటనపై

# రాజకీయ రచ్చ

- అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- ఓవర్సీస్ కాంగ్రెస్ కార్యక్రమాలే కారణమా?
- కేంద్రం తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం
- అధికారుల బృందాన్ని అమెరికాకు పంపే యోచన
- తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముదురుతున్న వివాదం

2

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విదేశీ పర్యటనలో అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంతో రాజకీయ దుమారం రేగింది. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర విదేశాంగ శాఖ.. బోస్టన్, న్యూయార్క్‌లో ఎంఐటీ, హార్వర్డ్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో సమావేశాలున్న అమెరికా షెడ్యూల్‌కు ఆమోదం ఇవ్వలేదు. ఈ పరిణామంపై తెలంగాణ కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా.. కేంద్ర నిర్ణయం రాజకీయంగా కొత్త చర్చకు దారితీసింది.



## కేంబ్రిడ్జ్ తో తెలంగాణ భాగస్వామ్యానికి కసరత్తు

- హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలకు ఆహ్వానం
- సంయుక్త పరిశోధనలపై చర్చ
- స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలకు సహకారం
- ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్
- లివర్‌పూల్‌తోనూ వ్యూహాత్మక భాగస్వామ్యం

3

## లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన రేవంత్

- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన
- అంబేద్కర్ జీవిత విశేషాలను వివరించిన యూకే ప్రతినిధులు
- సందర్శకుల డైరీలో సీఎం అనుభూతి
- హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌పై చర్చ

2






## భూ రీసర్వేను వేగవంతం చేయాలి

- పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి
- ప్రజలను ఇబ్బంది పెడితే సహించం
- రూ.230కే సిమెంట్ బ్యాగ్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృత పర్యటన

3



## సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలి

- నంది పహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభం కావాలి
- సెక్రటేరియట్ సోలార్ పార్కింగ్‌ను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి
- ఆర్ అండ్ బి సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 :

రాష్ట్రవ్యాప్తంగా సీఆర్ఐఎఫ్ ద్వారా నిర్మిస్తున్న రోడ్లు, సేతుబంధన్ పథకం బ్రిడ్జిలు, పురోగతిలో ఉన్న పలు ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలని, సెక్రటేరియట్ సోలార్ పార్కింగ్‌ను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి

మిగతా 3వ పేజీలో..

## పవర్‌ఫుల్ తెలంగాణ కోసం పక్కా ప్రణాళికలు

- విద్యుత్ కొరత లేని రాష్ట్రమే లక్ష్యం
- విద్యుత్ డిమాండ్‌కు దీటుగా ప్రణాళికలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 22 :

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. రాష్ట్రంలో విద్యుత్, నీటి కొరత లేకుండా పారిశ్రామిక రంగానికి అవసరమైన మౌలిక వసతులను

మిగతా 2వ పేజీలో..





3

## సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

- ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాలకే బోనస్

## షార్ట్ టర్మ్ కోర్సుల నిర్వహణ అవకాశాలు పరిశీలిస్తాం

లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీ



2



## హేజో లేబొరేటరీస్ కెమికల్స్ లో పేలుడు

- ఇద్దరు కార్మికుల మృతి
- క్షతగాత్రులు హైదరాబాద్‌కు తరలింపు

యాదాద్రి భువనగిరి, సిరి న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం

మిగతా 2వ పేజీలో..



## ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది?

- నిషేధిత జాబితా ఉప్పల్ బాధితులతో ఎమ్మెల్యే హరీష్ రావు

3




## కొత్త టీమ్‌తో మోదీ భేటీ

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులతో సమావేశం
- పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చ
- యువతను ఆకర్షించడంపై ప్రత్యేక వ్యూహం
- జెన్-జీతో నేరుగా అనుసంధానానికి ప్రణాళిక
- కొత్త బృందానికి నితిన్ నబీన్ తొలి పరిచయ సమావేశం

4




# గచ్చిబౌలిలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ తైక్వాండో పోటీలు

**హైదరాబాద్, ఆగస్టు22 :**

అంతర్జాతీయ తైక్వాండో పోటీలు శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్య మిస్తోంది. ప్రపంచంలోని 15 దేశాల జట్లు పాల్గొంటున్న ఈ పోటీల్లో స్పీడ్ పంచింగ్, స్పీడ్ కిక్కింగ్, హై రేంజ్ వరల్డ్ రికార్డు, ఫ్రంట్ కిక్, జంపింగ్ త్రస్తు కిక్, ఇన్నర్ ఎడ్జ్ ఔటర్ ఎడ్జ్ కిక్ లకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నారు. సమావేశం ప్రారంభించిన తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి మాట్లాడుతు అంతర్జాతీయ తైక్వాండో పోటీలు హైదరాబాద్ లో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. చిన్ననాటినుండే పిల్లలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తలిదండ్రులు కృషిచేయాలని అయన అక్కడికి వచ్చిన తలిదండ్రులను విజ్ఞప్తి చేశారు. ప్రతి మనిషి శారీరిక దారుఢ్యం కోసం కృషి చేయాల్సిన పరిస్థితి నెలకొన్న తరుణంలో క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఇటీవలే వరల్డ్ రికార్డు కోసం ఇక్కడే విద్యార్థులు కార్యక్రమం నిర్వహించామని అయన గుర్తు చేసారు. భారత దేశం నుండి ఎక్కువ మంది క్రీడాకారులను అంతర్జాతీయ వేదికలో నిలబడేలా చేయడమే తమ ఉద్దేశమని అయన అన్నారు. ఇప్పటి యువతకు ప్రోత్సహం కల్పించేలా పలువురు మాస్టర్లు కృషిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇప్పటికే 32 పర్యాయాలు అంత




ర్జాతీయ స్థాయిలో రికార్డులు హైదరాబాద్ క్రీడాకారులు సాధించారని అందుకు తాను సారథ్యం వహించినందుకు గర్వ పడుతున్నానని అయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ గజేందర్ కుమార్ తో పాటు దేశ విదేశాల మాస్టర్ లు పాల్గొన్నారు.

**అలరించిన నృత్య ప్రదర్శన**

అంతర్జాతీయ థైక్వాండో పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. చిన్నారులు గడీల ఇష్థారెడ్డి, ఆరాధ్యలు చేసిన నృత్య ప్రదర్శన అటు నిర్వాకులను, ఇటు సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆ చిన్నారులను నిర్వాకులు ప్రత్యేకంగా అభినందించారు.

# హేజో లేబొరేటరీస్ కెమికల్స్‌లో పేలుడు

**మొదటిపేజీ తరువాయి**

దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా మరో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కంపెనీలోని సిబ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మికులు విధులలో ఉన్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్నబోయిన నరేష్‌కుమార్ మృతిచెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పదిమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు. కంపెనీలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రియాక్టర్ పేలుడు, గతంలో కార్మికుడి మృతి ఘటనల నేపథ్యంలో కంపెనీలో భద్రతా ప్రమాణాలను అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.



# ఓటాయి సర్పంచ్ మృతి

- **అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి సీతక్క**

**కొత్తగూడ, ఆగస్టు 22:**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామ సర్పంచ్ గట్టి రాములు శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆయన నివాసంలో సర్పంచ్ రాములు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి అంత్యక్రియల్లో పాల్గొని సర్పంచ్ రాములు పాడె మోశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిత్యం ప్రజా సేవలో ముందుండి గ్రామ అభివృద్ధి కోసం కష్టపడే వ్యక్తి ఈ రోజు లేకపోవడం చాలా బాధాకరమని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి సీతక్కతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు సీనియర్ నాయకులు ఉన్నారు.

# రేవంత్ అమెరికా పర్యటనపై రాజకీయ రచ్చ

**హైదరాబాద్, ఆగస్టు 22, సిరి న్యూస్:**

**రాజకీయ కార్యక్రమాలే కారణమా?**

విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే సమయంలో ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ప్రధాన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలిస్తామని విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా షెడ్యూల్‌లో ఓవర్సీస్ కాంగ్రెస్ వేదికలపై కార్యక్రమాలు, పార్టీ సమావేశాలు ఉండటమే అనుమతి నిరాకరణకు కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక పర్యటనలో పార్టీ కార్యక్రమాలకు చోటు కల్పించడంపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు**

కేంద్ర నిర్ణయాన్ని తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. పెట్టుబడులు, అంతర్జాతీయ విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకురావాలన్న ప్రయత్నాలను కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపిస్తున్నారు. గతంలో ఇతర విపక్ష రాష్ట్రాల ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతుల విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేస్తున్నారు.

**అమెరికా కార్యక్రమాలు కొనసాగింపు**

అమెరికా పర్యటనకు సీఎం వెళ్లకపోయినా.. ముందుగా ఖరారైన విద్యా, పరిశోధన సంబంధిత కార్యక్రమాలను అధికారులు కొనసాగించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అమెరికాలోని విశ్వవిద్యాలయాలతో ప్రతిపాదిత అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్యాలపై చర్చలు కొనసాగించాలని సూచించారు. దీంతో పర్యటన రద్దయినా తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగనుంది.



**కాంగ్రెస్‌లోనూ అంతర్గత రాజకీయాలు**

రేవంత్‌రెడ్డి పర్యటన మధ్యలోనే హైదరాబాద్‌కు తిరిగి రావడం వెనుక రాష్ట్ర కాంగ్రెస్‌లోని అంతర్గత పరిణామాలు కూడా కారణమై ఉండొచ్చనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఎమ్మెల్యేల మధ్య విభేదాలు, మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదాలు, పార్టీలోని అసమ్మతి వర్గాల వ్యవహారాల నేపథ్యంలో సీఎం తిరిగి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు.

# పవర్‌ఫుల్ తెలంగాణ కోసం పక్కా ప్రణాళికలు

**మొదటిపేజీ తరువాయి**

కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వేదికగా ఎస్పీడీసీఎల్ నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్2026ను ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ శాఖ సాధిస్తున్న విజయాలు, తీసుకొస్తున్న సంస్కరణలు, ఆధునిక సాంకేతికతను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, పెట్టుబడిదారులు తెలంగాణలో మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి థర్మల్, సోలార్, హైడల్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ వంటి అన్ని మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సామర్థ్యాలను పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. బయటకు కనిపించకున్నా రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ ఉద్యోగులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని చెప్పారు. గతంలో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు పైగా చేరినా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పటిష్టం, ముందస్తు ప్రణాళికలు, అవసరమైన విద్యుత్‌ను సమయానుకూలంగా సమీకరించడం వల్ల సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు అందించగలిగామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. 1912 టోల్‌ఫ్రీ సేవలు, 'పవర్ అంబులెన్స్' ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. 1912కు ఫోన్ చేసిన వెంటనే సమస్యను నమోదు చేసి పరిష్కరించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అవసరమైన పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిబ్బందితో సిద్ధంగా ఉండే పవర్ అంబులెన్సెస్ ద్వారా విద్యుత్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలకు తక్షణమే చేరుకుని పరిష్కరించే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని వెల్లడించారు. సాంకేతికత వినియోగాన్ని పెంచుతూ ఇన్ హౌస్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయడం అభినందనీయమని భట్టి కొనియాడారు. వినియోగదారుడి నంబర్ ఆధారంగా అతని లొకేషన్, విద్యుత్ సరఫరా ఎక్కడినుంచి జరుగుతోంది వంటి సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులోకి తీసుకురావడం విద్యుత్ సేవల్లో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. 2047 నాటికి లక్ష్యాలను నిర్దేశించుకుని ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు□ కనీసం నాలుగైదేళ్ల సమయం అవసరమవుతుందని, అందువల్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు తప్పనిసరి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. థర్మల్ విద్యుత్‌తో పాటు గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నామని, సోలార్, హైడల్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాలను పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ రంగం వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగం సహా ప్రతి ఉత్పత్తి రంగానికి పునాది వంటిదని, రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రాష్ట్రంలో విద్యుత్ కొరతకు తావులేకుండా, పరిశ్రమల అవసరాలకు సరిపడ విద్యుత్‌ను అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని భట్టి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను కల్పించడం తోపాటు ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగికి రూ.కోటి ప్రమాద బీమా కల్పించినట్లు చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ సంస్కరణలు, విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. శాఖకు చెందిన యాప్‌లు, ప్రజాబాట కార్యక్రమం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, హైదరాబాద్‌లో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# షార్ట్ టర్మ్ కోర్సుల నిర్వహణ అవకాశాలు పరిశీలిస్తాం

**హైదరాబాద్, ఆగస్టు 22:**

లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వ సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రలేషియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో ఆయన సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విశిష్టతను, విద్యా రంగంలో ఉన్న అవకాశాలను వారికి రామకృష్ణారావు వివరించారు. తెలంగాణతో కలిసి పని చేసేందుకు ఉన్న సహకార అవకాశాలపై కూడా చర్చించారు. తెలంగాణ, హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి ఉందని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ (స్టెమ్‌ఎస్టీఈఎం), బిజినెస్ విద్యా రంగాల్లో ఇంపీరియల్ కాలేజీ ప్రపంచంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థతో తెలంగాణ భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరగడం రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు మరింత ఊతమివ్వనుంది.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ

- **సెప్టెంబర్ 15లోపు ఎంట్రీలు పంపాలి**

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 సీజన్ 2□ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈసారి కొత్తగా జానపద గీతాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు(ఆర్టికల్స్)కు చోటు కల్పించారు. ఈ పోటీని యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృతస్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు దోహదం చేస్తాయన్నారు. లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని సెప్టెంబర్ 15లోపు youngfilmmakerschallenge@gmail.com మెయిల్‌కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు.







# లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన రేవంత్

**లండన్, ఆగస్టు 22:**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి లండన్‌లోని చారిత్రక అంబేద్కర్ హౌస్‌ను సందర్శించారు. 192122 కాలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నివసించిన ఈ భవనాన్ని ప్రస్తుతం ఆయన జీవితాన్ని, ఆశయాలను ప్రతిబింబించే మ్యూజియంగా తీర్చిదిద్దారు. దాదాపు గంటపాటు సాగిన పర్యటనలో యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ చైర్ సంతోష్ దాస్.. యూకేలో అంబేద్కర్ జీవితానికి సంబంధించిన పలు విషయాలను ముఖ్యమంత్రికి వివరించారు.

**స్ఫూర్తినిచ్చిన అంబేద్కర్ హౌస్**

అంబేద్కర్ వ్యక్తిగత వస్తువులను పరిశీలించడం తన జీవితంలో గొప్ప అనుభూతుల్లో ఒకటని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సందర్శకుల డైరీలో తన అనుభూతిని నమోదు చేస్తూ.. అంబేద్కర్ హౌస్‌ను సందర్శించడం ఆధ్యాత్మిక క్షేత్రాన్ని దర్శించిన అనుభూతిని కలిగించిందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం మరింత అంకితభావంతో పనిచేయాలన్న తన సంకల్పం బలపడిందని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ క్యాంపస్**

మరోవైపు హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరిపింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధులతో తెలంగాణ బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసి వివిధ విభాగాల్లో విద్యా కోర్సులు నిర్వహించే అవకాశాలపై చర్చించారు.

# భూ రీసర్వేను వేగవంతం చేయాలి

**నిజామాబాద్, ఆగస్టు 22 , సిరి న్యూస్:**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, 'నుడా' చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్**

రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో కలిపి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, త్వరలో మరో రెండు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెవెన్యూ, హౌసింగ్, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు మహేష్‌కుమార్ గౌడ్ కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, నిజామాబాద్ ప్రజల కోరికకు అనుగుణంగా హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి ప్రకటించారు. ఇందుకోసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించి 1015 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. నిజామాబాద్‌తోపాటు సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలను గుర్తించి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. నిపుణులు, రైతుల సూచనల మేరకు తొలుత పది జిల్లాల్లోని 70 గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. అదేవిధంగా నక్షాలు లేని 413 గ్రామాల్లోనూ సర్వే నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. సర్వే సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నామని, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, కమీషన్లు తీసుకునేవారు, దందాలు చేసేవారు, విషపూరిత ఆలోచనలతో వ్యవహరించేవారికి తాము ఎలాంటి సమాధానం ఇవ్వబోమని పొంగులేటి స్పష్టం చేశారు.

# సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :**

ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు రూ.500ల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్దిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్ 44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10లోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని, సెప్టెంబర్ 10 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.



# రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

**సిద్దిపేట, ఆగస్ట్ 22 :**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పల్లె పల్లెకు పొన్నం అన్న ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

# ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది?

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :**

నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమీషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాదిమంది 22ఎ బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీష్ రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా కోడై కూస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22A బూచి చూపిస్తూ బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు.. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని హరీష్ రావు స్పష్టం చేశారు. తక్షణమే ఆయా కాలనీలను 22A నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలి

**మొదటిపేజీ తరువాయి**

ఇంజనీర్లను ఆదేశించారు. సెక్రటేరియట్‌లో రోడ్లు భవనాలు శాఖపై శనివారం సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో సెక్రటేరియట్‌లో ఏర్పాటు చేస్తున్న షెడెడ్ పార్కింగ్ (సోలార్ కార్ పార్కింగ్) పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. సెక్రటేరియట్‌కు ఉత్తర భాగంలో చేపట్టిన పనుల పురోగతిని మంత్రికి ఇంజినీర్లు వివరించారు. గత సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు సచివాలయ భవనం మూడు వైపులా (ఉత్తరం, పడమర, దక్షిణం) ఎలివేషన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్డింగ్ స్ట్రక్చర్ వరకే సోలార్ పార్కింగ్ ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సచివాలయ ఉత్తర భాగంలో రెండు వరుసల్లో, దక్షిణ భాగంలో మూడు వరుసల్లో, పడమర భాగంలో ఒక్క వరుసలో సోలార్ ప్యానెల్స్‌తో కూడిన కార్ పార్కింగ్ డిజైన్లు ఉండేలా చూడాలన్నారు. సంబంధిత డిజైన్లు అధికారులు మంత్రికి చూపారు. సోలార్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్‌పై 90వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, నెలవారీ విద్యుత్ బిల్లులో 16% ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు. సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలని, ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా జరుగుతున్న వర్క్ ప్రోగ్రెస్ ఇంకా మెరుగవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటివరకు 3,918 కి.మీ రోడ్లు, రూ.5159 కోట్లతో 316 పనులు మంజూరు చేశామని, అందులో కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, చాలావరకు పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. 202526కు సంబంధించి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కి.మీ రోడ్ల పనుల పురోగతి సంతృప్తికరంగా ఉన్నదని అధికారులను మంత్రి ప్రశంసించారు. పలు హై లెవెల్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలని సూచించారు. సేతుబంధన్ పథకం ద్వారా రూ.76 కోట్లతో చేపట్టిన నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. మిర్యాలగూడ, నందిపహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని, దానికి సంబంధించిన సాంకేతిక అంశాలు తక్షణం పూర్తి చేయాలని, స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సి.ఈ వనజను ఆదేశించారు. కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, రంగారెడ్డి పనుల పురోగతిపై అధికారులు మంత్రికి వివరించారు. అధికారులు ఇంకా కష్టపడి పనిచేయాలని, మెరుగైన రోడ్లు నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యంలో అత్యంత కీలకంగా వ్యవహరించాలని మంత్రి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఈఎన్సీ (అడ్మిన్) లింగారెడ్డి, సీఈలు వసంత్ నాయక్, వనజ, ధర్మారెడ్డి, డీసీఈ అహ్మద్ అబ్దుల్ అలీ, ఈఈ రూప్‌కరణ్, డీఈ రూపారాణి, ఏఈఈ గంగాధర్, పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.



# ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌తో యూరియా కొరత

- తక్షణం జోక్యం చేసుకోవాలన్న మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్ట్ 22 :**

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సుమారు పది రోజులపాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న వేళ ఈ షట్‌డౌన్ ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపివేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలని కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ప్లాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయాలని కేంద్రానికి విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు. శనివారం (నేటినుంచి)నుంచి ఎరువుల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే.

# కేంబ్రిడ్జ్ తో తెలంగాణ భాగస్వామ్యానికి కసరత్తు

**లండన్, ఆగస్టు 22 :**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విద్యావేత్తలతో సమావేశమై రాష్ట్రంలో విద్య, పరిశోధన రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించింది. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సంయుక్త పరిశోధనలు, స్టార్టప్‌లకు సహకారం అందించే అంశాలపై కార్యాచరణ రూపొందించాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి.



**పరిశోధన, విద్యపై దృష్టి**

సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు. ప్రపంచస్థాయి విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు.

**స్టార్టప్‌లకు చేయూత**

హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు చేపట్టడం, సంయుక్త పరిశోధనలు నిర్వహించడం, యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ సదుపాయాలు కల్పించడం, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాలపై భాగస్వామ్యానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు మరింత బలం చేకూర్చనుంది.

**లివర్‌పూల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం**

మరోవైపు లండన్‌లో రేవంత్‌రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రతినిధులు సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్‌తో పాటు లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. లైఫ్ సైన్సెస్, సాంకేతికత, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక రంగాల్లో తెలంగాణతో భాగస్వామ్యానికి లివర్‌పూల్ ఆసక్తి వ్యక్తం చేసింది. భాగస్వామ్యాన్ని ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది.

# కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

**సిరిసిల్ల, ఆగస్ట్ 22:**

తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్‌తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన డియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నాయని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు. కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు.



## యూపి ఎన్నికల్లో పటిష్ట చర్యలు

- యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 22 :**

ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్య నేతలకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను అందజేశారు. సుమారు 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ఖరీదు సుమారు రూ.10 లక్షలు ఉన్నట్లు భావిస్తున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతికి కూడా ఆ జాకెట్లను అందజేశారు. భద్రతలో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. వీరితో పాటు ఆ జాబితాలో 11 మంది మంత్రులు ఉన్నారు. సంజయ్ నిషాద్, నంద్ గోపాల్ గుప్తా, ఓం ప్రకాశ్ రాజ్‌భర్, బీజేపీ నేత అపర్ణయాదవ్ ఉన్నారు. తొలి దశలో 8 మందికి, రెండో దశలో 44 మందికి జాకెట్లను అందజేశారు. బీజేపీ నేతలు స్వతంత్ర దేవ్ సింగ్, జైవీర్ సింగ్, మహేంద్ర సింగ్‌కు కూడా జాకెట్లు ఇచ్చారు. యూపీలోని సుమారు 98 మంది ఇతర ముఖ్య నేతలకు ప్రత్యేకమైన భద్రతను కల్పించనున్నారు.

## పహల్గామ్ దాడి కేసులో హాఫీజ్ సయీద్‌కు సమన్లు

- జమ్మూ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నుంచి చర్యలు
- విదేశాంగ శాఖ ద్వారా సమన్లు పంపే యోచన
- ఇప్పటికే నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ
- అనుబంధ ఛార్జిషీట్‌లో కీలక నిందితుడిగా చేర్పు
- బీఎన్ఎస్, యూఏపీఏ చట్టాల కింద అభియోగాలు



**జమ్మూ, ఆగస్టు 22:**

2025 పహల్గామ్ ఉగ్రదాడి కేసులో లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు సమన్లు జారీ చేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సిద్ధమవుతోంది. జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ఎదుట విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ ఈ సమన్లను విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా సయీద్‌కు పంపనున్నట్లు సమాచారం. దాడికి సూత్రధారుల్లో ఒకరిగా అతడిని పేర్కొంటూ ఇప్పటికే నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది.

**అనుబంధ ఛార్జిషీట్‌లో సయీద్**

జూలైలో దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌లో సయీద్‌ను ఎన్ఐఏ నిందితుడిగా చేర్చింది. లష్కరే తోయిబా, దాని ప్రాక్సీ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు సంబంధించిన పాత్రతో పాటు వ్యక్తిగతంగా కూడా అతడిపై అభియోగాలు నమోదు చేసినట్లు తెలిపింది. భారత్‌పై యుద్ధానికి కుట్ర, పాకిస్థాన్ నుంచి దాడికి ప్రణాళిక వంటి ఆరోపణలతో బీఎన్ఎస్2023, యూఏపీఏ చట్టాల కింద కేసు నమోదు చేశారు.

**పాకిస్థాన్ కేంద్రంగా కుట్ర**

పహల్గామ్ దాడి వెనుక పాకిస్థాన్ కేంద్రంగా జరిగిన కుట్రకు సంబంధించిన ఆధారాలను దర్యాప్తులో సేకరించినట్లు ఎన్ఐఏ పేర్కొంది. అనుమానిత హ్యాండర్ సజిద్ జట్‌తో పాటు ఆపరేషన్ మహాదేవ్‌లో హతమైన ముగ్గురు ఉగ్రవాదులు, అరెస్టయిన ఇద్దరు నిందితుల పేర్లను ఛార్జిషీట్‌లో ప్రస్తావించింది. దాడి ప్రణాళిక, సహకారం, అమలులో లష్కరే తోయిబా పాత్ర ఉన్నట్లు ఆరోపించింది.

**కోర్టుకు హాజరు కాకపోతే**

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్రదాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. తొలుత స్థానిక పోలీసులు కేసు నమోదు చేయగా, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించింది. సమన్లు అందుకున్న తర్వాత కూడా సయీద్ కోర్టుకు హాజరుకాకపోతే, సంబంధిత చట్టపరమైన నిబంధనల ప్రకారం అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా ప్రకటించి విచారణ కొనసాగించే అవకాశం ఉంది.

## ఆన్‌లైన్ సెర్చ్ తో సొంత వైద్యం వద్దు

- లక్షణాలు చూసి వ్యాధి నిర్ధారణ చేసుకోవడం ప్రమాదకరం: రాజ్‌నాథ్‌సింగ్

**నోయిడా, ఆగస్టు 23:**

స్వల్ప అనారోగ్య లక్షణాలు కనిపించగానే ఇంటర్నెట్‌లో వెతికి సొంతంగా వ్యాధిని నిర్ధారించుకోవడం ప్రమాదకరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మంచిదే అయినప్పటికీ, ఆన్‌లైన్‌లో లభించే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని వైద్య నిర్ణయాలకు రావద్దని సూచించారు.

**ఆన్‌లైన్ సమాచారంతో గందరగోళం**

తమ లక్షణాలను వైద్యులకు వివరించడానికి బదులుగా ఇంటర్నెట్‌లో చదివిన వ్యాధి పేర్లను నేరుగా చెప్పే వారి సంఖ్య పెరుగుతోందని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సాధారణ ఛాతీ నొప్పిని కూడా ఇంటర్నెట్‌లో వెతికి గుండె జబ్బుగా భావించడం వల్ల అనవసర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

**'దుక్ దుక్' అంటూ లక్షణాల వివరణ**

స్థానిక భాషలో రోగులు చెప్పే లక్షణాలను అర్థం చేసుకోవడం కొన్నిసార్లు వైద్యులకు సవాలుగా మారుతోందని ఆయన చమత్కరించారు. ఓ రోగి ఛాతీలో 'దుక్ దుక్'గా ఉందని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఇంటర్నెట్‌లో చదివి తనకు క్లాస్ట్రోఫోబియా ఉందని భావించిన ఓ వ్యక్తి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. వైద్యుల సూచనలను సరైన అవగాహనతో స్వీకరించాలని సూచించారు.

**సాంకేతికతకు మానవీయత అవసరం**

ఆధునిక సాంకేతికత శరీరంలోని సమస్యలను గుర్తించడంలో సహాయపడినా, రోగి భయం, ఆందోళనను అర్థం చేసుకోవడంలో వైద్యుడి పాత్ర కీలకమని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వైద్య నైపుణ్యానికి సాంకేతికత తోడైతేనే మెరుగైన చికిత్స అందుతుందని పేర్కొన్నారు.

**ఏఐ వినియోగంలో గోప్యత ముఖ్యం**

వైద్య రంగంలో కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రోగుల వ్యక్తిగత సమాచార గోప్యతను కాపాడటం అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. రోగులను కేవలం సంఖ్యలుగా చూడకుండా వారికి విశ్వాసం, భరోసా కల్పించాలని వైద్యులకు సూచించారు.

# కొత్త టీమ్‌తో మోదీ భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:**

బీజేపీ కొత్తగా నియమించిన జాతీయ కార్యవర్గ సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పార్టీ సంస్థాగత కార్యకలాపాల బలోపేతం, యువతతో అనుసంధానం, పార్టీ సిద్ధాంతాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతకుముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త బృందంతో తొలి పరిచయ సమావేశం నిర్వహించారు.

**జెన్-జీపై ప్రత్యేక దృష్టి**

కొత్త తరం యువతతో నిరంతరం సంభాషించేందుకు బీజేపీ 'జెన్ జెడ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్'కు రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. యువత ఆకాంక్షలు, సమస్యలు, అభిప్రాయాలు, భవిష్యత్ అంచనాలను తెలుసుకోవడంతో పాటు వారితో నేరుగా చర్చించేందుకు ఈ కార్యక్రమం ద్వారా వేదికలు ఏర్పాటు చేయనున్నారు.

**అనుభవం.. యువ నాయకత్వం**

ఈ కార్యక్రమానికి సంబంధించిన బృందంలో నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శులు స్మృతి ఇరానీ, వినోద్ తావ్డే, గుజరాత్ మంత్రి హర్ష్ సంఘవి, ఛత్తీస్‌గఢ్ మంత్రి ఓపీ చౌదరి తదితరులకు చోటు కల్పించినట్లు సమాచారం. సంస్థాగత అనుభవం ఉన్న నేతలతో పాటు యువతకు చేరువగా ఉన్న నాయకులను కలిపి కొత్త తరంతో పార్టీ సంబంధాలను బలోపేతం చేయాలని బీజేపీ భావిస్తోంది. కార్యక్రమం ప్రారంభ తేదీ, విధివిధానాలను పార్టీ త్వరలో ప్రకటించనుంది.




## దేశవ్యాప్తంగా భారీ వర్షా లకు అవకాశం

- మధ్య, తూర్పు భారతంలో తీవ్ర వర్ష సూచనలు
- ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో అత్యంత భారీ వర్షాలు
- ఉత్తర బెంగాల్ ఖాతంలో అల్పపీడనం
- ఢిల్లీ, పంజాబ్, హిమాచల్‌లోనూ వర్షాలు
- తెలంగాణలో మోస్తరు నుంచి చెదురుమదురు వానలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:**

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ముఖ్యంగా మధ్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఈశాన్య మధ్యప్రదేశ్‌పై కొనసాగుతున్న వాతావరణ వ్యవస్థతో పాటు ఉత్తర బెంగాల్ ఖాతంలో ఏర్పడుతున్న మరో వ్యవస్థ వర్షాలకు కారణమవుతున్నట్లు పేర్కొంది.

**పలు రాష్ట్రాల్లో భారీ వర్షా లు**

ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్, తూర్పు ఉత్తరప్రదేశ్, ఒడిశాలో అక్కడక్కడా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉండే సూచనలు ఉన్నాయని పేర్కొంది. హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పశ్చిమ మధ్యప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

**బెంగాల్ ఖాతంలో అల్పపీడనం**

ఉత్తర బెంగాల్ ఖాతంలో మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడుతోంది. పశ్చిమ బెంగాల్‌బంగ్లాదేశ్ తీరాలకు సమీపంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో తూర్పు, పశ్చిమ మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో రానున్న రోజుల్లో వర్షాలు విస్తరించే అవకాశం ఉందని తెలిపింది.

**తెలంగాణలోనూ వర్ష సూచనలు**

అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొంకణ్, గోవా, తీర కర్ణాటక, కేరళ, మాహే, లక్షద్వీప్, ఒడిశా, గంగానది తీర పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్ దీవుల్లో విస్తారంగా వర్షాలు పడనున్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణతో పాటు దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

## చిన్నారులకు జలుబు మందులపై కేంద్రం ఆంక్షలు

- నాలుగేళ్లలోపు పిల్లలకు కాంబినేషన్ ఔషధాలు వద్దు
- క్లోర్‌ఫెనిరమైన్, ఫెనిలెఫ్రిన్ కలయికపై పరిమితులు
- ప్యాకింగ్‌పై తప్పనిసరిగా హెచ్చరిక ముద్రణ
- నిపుణుల సూచనల మేరకు కేంద్రం నిర్ణయం
- జూన్‌లో 16 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:**

చిన్నారుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జలుబు, దగ్గు, అలర్జీ లక్షణాల కోసం ఉపయోగించే క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫెనిలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్ కాంబినేషన్ ఔషధాలను నాలుగేళ్లలోపు పిల్లలకు వినియోగించరాదని స్పష్టం చేసింది. ఈ మందుల తయారీ, విక్రయాల్లో నిబంధనలను కఠినతరం చేసింది.

**ప్యాకింగ్‌పై హెచ్చరిక తప్పనిసరి**

డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు, నిపుణుల కమిటీ సూచనల ఆధారంగా కేంద్ర ఆరోగ్య శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. సంబంధిత ఔషధాలను తయారు చేసే సంస్థలు ప్యాకేజింగ్, లేబుళ్లు, ప్రచార సామగ్రిపై నాలుగేళ్లలోపు పిల్లలకు ఈ మందులను ఉపయోగించరాదని స్పష్టమైన హెచ్చరికను ముద్రించాలని ఆదేశించింది.

**16 కాంబినేషన్ మందులపై నిషేధం**

మానవ వినియోగానికి సంబంధించిన కాంబినేషన్ ఔషధాలపై కేంద్రం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది జూన్‌లో దేశవ్యాప్తంగా 16 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందుల తయారీ, విక్రయం, పంపిణీని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిషేధించింది. తాజాగా చిన్నారులకు సంబంధించిన ఈ ఔషధాల వినియోగంపై పరిమితులు విధించింది.

## ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కలకలం

- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన కేసులు
- ఈ ఏడాది 1,777 హెచ్1ఎన్1 కేసులు
- ఒక్కరోజే 114 కేసుల నమోదు
- ప్రజలకు కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరిక
- ఆసుపత్రుల్లో చికిత్సకు ఏర్పాట్లు సిద్ధం



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:**

దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. 2026లో ఇప్పటివరకు నమోదైన ఫ్లూ కేసులు 2,392కు చేరుకోగా, వాటిలో 1,777 హెచ్1ఎన్1 కేసులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే కేసుల సంఖ్య గణనీయంగా పెరగడంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. ఫ్లూ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా, పరిస్థితి తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

**హెచ్1ఎన్1 వ్యాప్తి తీవ్రత**

ఢిల్లీలో ఒక్క గురువారం 114 హెచ్1ఎన్1 కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో గతంతో పోలిస్తే ఈసారి కేసులు భారీగా పెరిగినట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమ వైరస్ వ్యాప్తికి అనుకూల పరిస్థితులను కల్పిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

**లక్షణాలపై అప్రమత్తత**

జ్వరం, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు స్వైన్ ఫ్లూలో కనిపిస్తాయి. కొందరిలో కళ్లలో ఎర్రదనం, నీరు కారడం, బలహీనత కూడా ఉండవచ్చు. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

**జాగ్రత్తలు తప్పనిసరి**

చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, అవసరమైనప్పుడు మాస్క్ ధరించడం, అనారోగ్యంతో ఉన్నవారికి దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకలు, వైద్యులు, మందులు, పరికరాలకు కొరత లేదని తెలిపారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, లక్షణాలు తీవ్రంగా ఉంటే ఆలస్యం చేయకుండా వైద్య చికిత్స తీసుకోవాలని సూచించారు.

## స్కూల్‌లోకి అనుమతి లేకుండా వెళ్లారంటూ అభిజీత్ దీప్కేపై కేసు

- లాతూర్‌లో పోలీసుల ఎఫ్ఐఆర్ నమోదు
- ప్రభుత్వ పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించారని ఆరోపణ
- తరగతులకు అంతరాయం కలిగించినట్లు ఫిర్యాదు
- ఉపాధ్యాయులను బెదిరించారంటూ ఆరోపణలు
- వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినట్లు ఫిర్యాదు





**లాతూర్, ఆగస్టు 22:**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు మరికొందరిపై మహారాష్ట్రలోని లాతూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించడం, తరగతులకు అంతరాయం కలిగించడం, ఉపాధ్యాయులను బెదిరించడం వంటి ఆరోపణలపై ఆసా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. జవళి సమీపంలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలు సయ్యద్ షమ్షద్‌బానో ఖైరతాలీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్య తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం**

సీజేపీ చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా అభిజీత్ దీప్కే లాతూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తున్నారు. పాఠశాలల్లోని సమస్యలను పరిశీలించి వాటిని వెలుగులోకి తీసుకురావడమే కార్యక్రమ ఉద్దేశమని తెలుస్తోంది. ఇందులో భాగంగా జవళి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలను ఆయన బృందం సందర్శించింది.

**ఉపాధ్యాయులపై బెదిరింపుల ఆరోపణ**

అనుమతి లేకుండా పాఠశాలలోకి ప్రవేశించి విద్యార్థుల మధ్య కూర్చొని ప్రశ్నలు అడగడంతో తరగతులకు, అధికారిక కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధ్యాయులను సస్పెండ్ చేయిస్తానని బెదిరించినట్లు కూడా ఆరోపణలు చేశారు. పాఠశాలలో జరిగిన విషయాలను వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు**

మరో పాఠశాల విద్యార్థులను తీసుకొచ్చి తరగతి గదుల్లో కూర్చోబెట్టినట్లు కూడా ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఘటనపై భారతీయ న్యాయ సంహితలోని 132, 329(3), 351(2), 356(2) సెక్షన్ల కింద అభిజీత్ దీప్కేతో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జానపద కళలే మన జాతి సంపద..

- ఓరుగల్లు కళా వైభవాన్ని కాపాడుకుందాం...
- అంతరించిపోతున్న కళలకు ఊపిరిపోసి భావితరాలకు అందించాలి – ఈగ మల్లేశం
- ఓరుగల్లు సాంస్కృతిక వైభవాన్ని భావితరాలకు అందించాలి



**శెనార్తి మీడియా, హన్మకొండ :** ఓరుగల్లు వీరత్వానికి, అద్భుతమైన జానపద కళలకు పురిటిగడ్డగా, సాంస్కృతిక వైభవానికి పుట్టినిల్లుగా నిలిచిందని ఉభయ తెలుగు రాష్ట్రా ల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ , చిన్న పరిశ్రమల పూ ర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాం స్కృతిక శాఖ, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు–కాకతీయ సకల కళల జాతర" ఉత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ ఓరుగల్లు గడ్డ ఘనమైన కళలకు, అద్భుతమైన సంస్కృతికి నిలయమని అన్నారు. తెలంగాణ జానపద కళలు, కాకతీయుల కళా వైభవం కేవలం వినోదం కోసం మాత్ర మే కాదని, అవి మన జాతి సంపద అని పేర్కొన్నారు. అంతరించిపోతున్న జానపద కళలను, కాకతీయుల వైభవాన్ని పరిరక్షిం చి భావితరాలకు భద్రం గా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలం గాణ జానపద వైభవాన్ని చాటిచెప్పేలా కళాకారులు ప్రదర్శిస్తున్న నైపుణ్యం అభినందనీయమని, ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు ఓరుగల్లు ఘనకీర్తిని ప్రపంచానికి మరోసారి చాటిచెబుతాయని తెలిపారు. నేటి యువతలో కొందరు చెడు సావాసాలకు బానిసలై క్షణికావేశంలో తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన ఇతిహాసాలు, కళలు, సంప్రదాయాలు, సంస్కా రం యువతకు మంచి మార్గాన్ని చూపించడంలో ఎంతో దోహదపడతాయని అన్నా రు. తల్లిదండ్రులు పురాణాలు, చరిత్ర, ప్రాచీ న కళలు, సంస్కృతికి సంబంధించిన విషయాలను భావితరాలకు అందించేలా ము ఖ్యపాత్ర పోషించాలని సూచించారు. స్వా తంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా తెలంగాణలో ఇప్పటికీ లిపి లేని కళారూపాలు 103 రకాలు ఉన్నాయని, వాటిపై ఆధారపడి అనేక మంది కళాకారులు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని ఈగ మల్లేశం తెలిపారు. కళలనే జీవనాధారంగా చేసుకున్న కళాకారులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి ఆర్థికంగా, సామాజికంగా చేయూతనందించాలని ఆయన డిమాండ్ చేశారు. జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వ ర్యంలో జడల శివ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనగాం రాము వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డా. హరిప్రియ హరినాథ్, శంకర్ సారంగపాణి శిష్యులు, సింగర్ శ్యామ్, ప్రసాద్, సురేం దర్, ఇమ్మానుయేల్, మున్నా, తోట రవి, రంగనాథ్, చంద్రశేఖర్, బుజంగారావు, శిభ, రోజా రాణి, బిక్షపతి, శ్రీకాంత్, మురళి మధు, కాజీపేట ప్రభాకర్, చిరంజీవి, ప్రవీ ణ్, మామిండ్ల లక్ష్మణ్, కరిముల సంపత్ రావు, సంపత్ యాదవ్, రవీందర్ రెడ్డి, జూలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొ న్నారు. వివిధ జిల్లాల నుంచి జానపద, ఒగ్గు, చిందు, యక్ష గానం, భగవతుల, శాస్త్రీయ కళాకారులు హాజరై తమ ప్రదర్శనలతో అలరించారు.

## పంచాయతీ కార్యదర్శి పాషాపై విచారణ



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

రాజపూర్ పంచాయతీ కార్యదర్శి పాషాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కరీంనగర్ జెడ్పీ డిప్యూటీ సీఈఓ పవన్ కుమార్ శనివారం శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రాజపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం పంచాయతీ కార్యదర్శి పాషా డబ్బులు వసూలు చేశారని పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గతంలో రాజపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో హుజురాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేపట్టగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న పాషా హాజరు కాలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ విచారణకు హాజరు కాకపోవడంతో పాషాను సస్పెండ్ చేశారు. మరోసారి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో జెడ్పీ డిప్యూటీ సీఈఓ పవన్ కుమార్ శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. గతంలో చేపట్టిన విచారణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శి పాషా మరోసారి విచారణకు హాజరు కాలేదు. విచారణకు సంబంధించిన వివరాలతో నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ పవన్ కుమార్ తెలిపారు.

# రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

- సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు






**నారాయణపేట, ఆగస్టు,22:** రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 12న నిర్వహించనున్న మూడో జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జూన్ 20న నిర్వహించిన జాతీయ లోక్‌ఆదాలత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,300 కేసులను పరిష్కరించి,నారాయణపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 18వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు మరియు సంబంధిత సిబ్బందిని అభినందించారు. సెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్–బెయిలబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్బీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్యనాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ , డీఈఈ రాములు,డి.శ్రీనివాసులు ఆర్డీఓ ఆఫీస్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

వరి సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచించారు. శంకరపట్నం మండలం తాడికల్ రైతువేదికలో ATMA ఆధ్వర్యంలో రైతులకు RPL శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన ఆధునిక సాగు పద్ధతులు, పురుగు, తెగుళ్ల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులతో పాటు నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మానకొండూర్ ఏడీఏ శ్రీధర్, కేవీకే శాస్త్రవేత్త డి. శ్రీనివాస్ రెడ్డి, శంకరపట్నం ఏవో వెంకటేష్, ఏటీఎం అర్చన, ఏఈవోలు, మండల రైతులు పాల్గొన్నారు. అలాగే ఆయిల్‌పామ్ అధికారులు పాల్గొని ఆయిల్‌పామ్ సాగు విధానం, సాంకేతిక అంశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు వివరించారు. రైతులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు.

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం

**శెనార్తి మీడియా, రామన్నపేట :**



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, కక్షిదారులకు త్వరిత గతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జి. సబిత, సీనియర్ సివిల్ జడ్జి–కమ్–చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజి స్ట్రేట్ జడ్జి డి. సత్యయ్య పాల్గొన్నారు. జాతీ య లోక్ అదాలత్ లో రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకొని వీలైనన్ని ఎక్కువ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల సమయం, వ్యయం ఆదా కావడంతో పాటు కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రామన్నపేట సబ్ – ఇన్ స్పెక్టర్, మోత్కూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ తో పాటు కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయశాఖ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, కేసుల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించాలని సమావేశంలో సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కేసు లను రాజీ ద్వారా పరిష్కరించేందుకు సం బంధిత అధికారులు, న్యాయవాదులు ,కక్షిదారులు సహకరించాలని మండ ల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట కోరింది.

## మూలమలుపు వద్ద భద్రతా చర్యలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

ఆముదాలపల్లి–వీణవంక రహదారి లోని ఎల్‌షేప్ టర్నింగ్ వద్ద కాచాపూర్ గ్రామ రోడ్డు సేఫ్టీ కమిటీ చైర్మన్, సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత చర్యలు చేపట్టారు. టర్నింగ్ వద్ద వాహనదారులకు కనిపించకుండా ఉన్న చెట్ల పొదలను తొలగించారు. దెబ్బతిన్న డబ్ల్యూ–బీమ్‌ను సరిచేసి తిరిగి బిగించారు. వాహనదారులు టర్నింగ్‌ను ముందుగానే గుర్తించేలా రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ చందు, కాచాపూర్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**శెనార్తి మీడియా, వికారాబాద్:**




పిల్లల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షిత వాతావరణం కల్పించడం, అవసరమైన సమయంలో న్యాయ సహాయం, రక్షణ అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ లాల్ సింగ్ శ్రీనివాస నాయక్ అన్నారు. NALSA Child Friendly Legal Services for Children Scheme–2024లో భాగంగా వికారాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ అయిన ఉపాధ్యాయులకు ఒకరోజు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్, అతిథిగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం, రక్షణ, కౌన్సెలింగ్, పునరావాసం, న్యాయం బాలల అనుకూల విధానంలో అందేలా చూడటమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పిల్లలు న్యాయ వ్యవస్థను చూసి భయపడకుండా తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించేలా వారికి భరోసా కల్పించాలని సూచించారు.

పాఠశాలల్లో పిల్లలపై జరిగే వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, సైబర్ నేరాలు తదితర సమస్యలను ఉపాధ్యాయులు ముందుగానే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణకు పోలీస్, న్యాయ సేవా సంస్థ, విద్య, సంక్షేమ, కార్మిక శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ పిల్లల భద్రత విషయంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏదైనా సమస్యను గుర్తించిన వెంటనే పోలీస్, సంబంధిత చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి పి. ప్రదీప్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ. రాధిక, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. శాంతిలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వైష్ణవి, జిల్లా సంక్షేమ అధికారి కె. కాంతారావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వల్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.డి. అబ్దుల్ ఘని, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎస్. శ్రీకాంత్, నామినేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, డీఎల్ఎస్ఏ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు

**శెనార్తి మీడియా, నారాయణపేట:**

ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగం గా శనివారం నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సమగ్రంగా తనిఖీ చేశారు.ముందుగా పోలీస్ సిబ్బంది పరేడ్ నిర్వహించి వారి టర్న్‌అవుట్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని, ప్రహరీ చుట్టూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని సూచించారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చే ప్రజలకు రిసెప్షన్ వద్ద తగిన విధంగా స్పందించాలని, ఫిర్యాదులను తప్పనిసరిగా ఆన్లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారులకు రసీదు అందించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు.సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ.. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో వీపీవోలు పర్యటించి సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో కనీసం నాలుగు కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## ముడతలు,వలయాలు ఇలా తొలగిద్దాం



వయసు పెరిగేకొద్దీ ముఖంపై ముడతలు, కండ్ల కింద వలయాలు అందాన్ని దూరం చేస్తాయి. ఈ ముడతలు, వలయాలను గోరు వెచ్చని నీళ్లు తరిమికొడతాయి. వెడల్పాటి గిన్నెలో గోరువెచ్చని నీళ్లు పోసి.. అందులో 20 సెకండ్ల పాటు ముఖాన్ని ఉంచండి. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయితే, పదేసి సెకండ్ల చొప్పున రెండు, మూడుసార్లు ముఖం అంతా మునిగేలా తలను నీళ్లలో ఉంచాలి. తర్వాత మెత్తటి వస్త్రంతో ముఖాన్ని తుడుచుకోవాలి. గోరువెచ్చని నీళ్లతో ముఖం కడగడం వల్ల చర్మం తాజాగా మారి ముడతలు తగ్గుముఖం పడతాయి. మొటిమలు, మచ్చలు కూడాతగ్గతాయి. రక్తప్రసరణ మెరుగై చర్మం మెరుస్తుంది. గోరువెచ్చని నీళ్లు చర్మంపై ఉండే మృతకణాలను తొలగిస్తాయి. దుమ్ము, ధూళి, మేకప్ వల్ల మూసుకుపోయిన స్వేదరంధ్రాలను తెరుస్తాయి. ఫలితంగా చర్మానికి మంచి నిగారింపు వస్తుంది



## ఏడుపూ మంచిదే..!

ఏడుపుకు మనిషికి అవినావ సంబంధం ఉంటుంది. పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకు మనిషికి కన్నీళ్లు తోడుగా ఉంటాయి. కష్టాలు, కన్నీళ్లు కామన్ గా వస్తూ ఉంటాయి. బాగా సంతోషం కలిగినా కన్నీళ్లే వస్తాయి... విపరీతమైన బాధలోనూ దు:ఖం పొంగివస్తుంది. అయితే కన్నీరంతా దు:ఖమేమీ కాదు. ఉల్లిపాయలు కోసేటప్పుడు కూడా కన్నీళ్లు వస్తాయి.. అలా అని ఏడుస్తున్నట్లు దాని అర్థం కాదు కదా.

అయితే కొన్ని సందర్భాలలో ఇంట్లో ఎవరైనా ఏడుస్తుంటే ఏడువు ఏం నష్టం లేదు అని అంటుండటం మనం వింటుంటాం. పెద్దలు ఆ మాట ఊరికే అనలేదండోయ్. ఏడుపు వల్ల చాలా ప్రయోజనాలే ఉన్నాయండి. అందుకే ఎంత ఏడిస్తే అంత మంచిది అని అంటుంటారు మన పెద్దలు. సహజంగా ఏడుపు వచ్చే స్తేనే ఏడుపు వల్ల లభించే ప్రయోజనాలను పొందగలుగుతాము. ఏడుపు వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే ఇటీవల కొంతకాలంగా లాఫింగ్ క్లబ్ ల మాదిరిగా క్రయింగ్ క్లబ్ లు కూడా వచ్చేస్తున్నాయి. అయితే అసలు ఏడుపు వల్ల ఏం ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు చూడండి.

ఏడుపు వల్ల ప్రయోజనాలివే

ఏదైనా గాయం జరిగినప్పుడు నొప్పి తట్టుకోలేక గట్టిగా ఏడ్చేస్తుంటాం. ఇదీ ఒకందుకు మంచిదేనట. కన్నీళ్లలో ఒకరకమైన పెయిన్ కిల్లర్ ఉంటుందట. బాగా ఏడ్చిన తర్వాత నొప్పి తగ్గినట్లు అనిపించడానికి ఇదే కారణం.

ఏడుపు చర్మ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? ఏడ్చే సమయంలో మొఖంలో రక్త ప్రసరణ పెరిగి చర్మానికి కొత్త నిగారింపు వస్తుంది. మనసారా ఏడ్చినప్పుడు మనసులోని చేదు జ్ఞాపకాలు మసకబారిపోతున్న ఫీలింగ్ వస్తుంది.

కన్నీళ్లతో పాటు కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ కూడా బయటకి వెళ్లిపోతుంది. అందువల్ల బాగా ఏడ్చిన తర్వాత మనసు తేలికపడుతుంది.

ఏడ్చినప్పుడు కన్నీళ్లు వస్తాయి. కన్నీళ్లు మన కళ్లను పొడిబారనీయవు. బైక్ కు ఇంజిన్ ఆయిల్ ఎలా పనిచేస్తుందో కళ్లకు సహజసిద్ధమైన లూబ్రికెంట్స్ ఇవి. ఎక్కువగా సంతోషంగా ఉంటే మనసారా నవ్వుతాం. ఓ అంచనా ప్రకారం మనసారా నవ్వినప్పుడు 1.3 క్యాలరీలు కరిగిపోతాయి..మనసారా ఏడ్చినప్పుడు కూడా అంతే క్యాలరీలు కరిగిపోతాయంట.

# ధనియాలతో ఇన్ని లాభాలున్నాయా?



మనం ఇంట్లో ఉపయోగించే ఆహార దినుసులలో ధనియాలు ఒకటి. వంటల్లో ధనియాలకు ఉండే ప్రాముఖ్యత అంతా కాదు. ధనియాలు అనేక అనారోగ్య సమస్యలకు మంచి దివ్య ఔషధంలా పనిచేస్తాయి. మన శరీరానికి కావలసిన ఆరోగ్య ప్రయోజనాలను ధనియాలు ఇస్తాయి. ఇక ధనియాలు మనకు ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలను గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

### మధుమేహం కంట్రోల్ చేసుకోవచ్చు..!




ధనియాలు మధుమేహాన్ని నివారించడానికి అద్భుతంగా పనిచేస్తాయి. మధుమేహం రాకుండా ధనియాలు కాపాడుతాయి. ధనియాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ ను నియంత్రించడానికి ధనియాల పొడిని ఒక గ్లాసు నీళ్లల్లో మరిగించి చల్లార్చి తీసుకుంటే ఎంతో బాగా పనిచేస్తుంది.

అధికంగా ఉంటే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ధనియాలు ఎంతో బాగా ఉపయోగపడతాయి. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని తగ్గించడానికి కూడా ధనియాలు ఉపయోగపడతాయి.





### జీర్ణవ్యవస్థకు మేలు

ధనియాలు మన జీర్ణవ్యవస్థను కాపాడతాయి. ధనియాలు మన బరువు తగ్గడానికి ప్రధానంగా దోహదం చేస్తాయి. ధనియాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అందుకు తగినట్టు మనం ఆహారంలో భాగం చేసుకోవాలి. ఆరోగ్యానికి ధనియాలు నిజంగా వరం అని చెప్పాలి.

### లివర్ ఆరోగ్యం

ధనియాలు రోజు తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. ధనియాలు మన లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. అనేక చర్మ సమస్యలను తగ్గించడంలో



ధనియాలు కీలకంగా పనిచేస్తాయి. గజ్జి, దురదలు, దద్దుర్లు, వాపులు వంటి వాటిని ధనియాలు తగ్గిస్తాయి.

### ధనియాలతో కొలెస్ట్రాల్ కు చెక్

అధిక బరువుతో బాధపడేవారు ధనియాల నీళ్లను తాగడం వల మంచి పయోజనం ఉంటుంది. రకంలో కొలెసాల్

### నార్మల్ పీరియడ్స్ కోసం..




రక్తస్రావం అధికంగా అవుతున్నవారు ధనియాల నీళ్లను మరిగించి తేనె లేదా పటిక బెల్లం కలుపుకుని తాగితే రక్తస్రావం తగ్గి పీరియడ్స్ నార్మల్ గా వచ్చే అవకాశం ఉంటుంది. ధనియాలు మన శరీరంలోని ఫ్రీ రాడికల్స్ ని ఎదుర్కోవడానికి ఎంతో బాగా ఉపయోగపడతాయి. మన శరీర ఆరోగ్యానికి మాత్రమే కాకుండా చర్మ సౌందర్యానికి





కూడా ధనియాలు ఉపయోగపడతాయి.

## నిద్రతోనే మానసిక ఆరోగ్యం



నిద్ర మన శరీరానికి, మానసిక ఆరోగ్యానికి ఎంతో కీలకమైంది. కాగా నిద్ర తగ్గినా, అస్సలు లేకపోయినా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. సరైన నిద్ర అనేది శారీరక మానసిక సమస్యలను పరిష్కరిస్తుంది. మన ఆహారపు అలవాట్లు, నిద్ర మన శారీరక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి.

అదే విధంగా మన మానసిక ఆరోగ్యం కూడా చాలా ఎక్కువగా ప్రభావితమవుతుంది. నిద్ర మన మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఒత్తిడి మరింతగా పెరిగి డిప్రెషన్ బారీన పడాల్సి వస్తుంది. దీని కారణంగా మానసిక సమస్యలు తలెత్తి జ్ఞాపక శక్తి తగ్గుతుందని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

సుదీర్ఘకాలం నిద్ర లేకపోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని సైకియాట్రిస్ట్ లు వెల్లడిస్తున్నారు. ఇది పలు సమస్యలకు తగిన పరిష్కారాలకు సరైన నిర్ణయం తీసుకోలేకపోవడంపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది.

నిద్ర సరిపోకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు కారణం అవుతుంది. అటువంటి పరిస్థితులలో, మానసికంగా దృఢంగా ఉండటానికి, మానసిక స్థితి నియంత్రణకు ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరం అని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఇది మెదడు పనితీరుకు మద్దతు ఇవ్వడం, రోజువారీ ఒత్తిడిని తొలగించడానికి ,మానసిక ప్రశాంతతను మెరుగుపరచడమేకాకుండా, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. తద్వారా మానసికంగా హెల్తీగా ఉండొచ్చు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత నిద్ర అవసరమని వైద్యులు చెబుతున్నారు. మనం నిద్రపోతున్నప్పుడు, మన మెదడుకు జ్ఞాపకాలను నిల్వచేసుకోవడానికి, భావోద్వేగాలను ప్రాసెస్ చేయడానికి కోలుకోవడానికి అవకాశం ఉంటుంది.



నిద్ర లేకపోవడంఅనేది నిద్ర ఈ ప్రక్రియలకు అంతరాయం కలిగిస్తుంది. దీని కారణంగా దేని మీద శ్రద్ధ పెట్టలేరు.

# మొబైల్ తయారీకి రూ.62,500 కోట్ల ప్రోత్సాహకాలు

రూ.10,000 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకే అర్హత



**దిల్లీ:** దేశంలో మొబైల్ ఫోన్ల తయారీని పెంచడానికి, స్వదేశీ బ్రాండ్‌లను బలోపేతం చేయడానికి రూ.62,500 కోట్ల ప్రోత్సాహకాలతో తలపెట్టిన మొబైల్ ఫోన్ తయారీ పథకం (ఎంపీఎంఎస్) మార్గదర్శకాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. 2026 ఏప్రిల్ 1 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు పరిగణిస్తామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఎంపీఎంఎస్ పథకాన్ని 2 విభాగాలుగా విభజించారు. మొబైల్ ఫోన్ల తయారీకి ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒకటైతే, దేశీయ మొబైల్ బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడం రెండోది. దేశీయంగా తయారీ/అసెంబ్లింగ్‌తో 2025-26లో రూ.10,000 కోట్ల టర్నోవర్ సాధించిన అంతర్జాతీయ మొబైల్ కంపెనీలూ ఈ పథకం కింద అర్హత పొందుతాయి. కనీసం 51% భారతీయ యాజమాన్యం కలిగిన ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ (ఈఎంఎస్), మొబైల్ కంపెనీలకు 2025-26లో రూ.1000 కోట్ల టర్నోవర్ ఉన్నా ఈ పథకంలో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. వీరికి ఒక సంవత్సరం పాటు జెస్టేషన్ పీరియడ్ కూడా లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న బ్రాండ్‌లు 2025-26 విక్రయాలకు అదనంగా ఏటా కనీసం రూ.5,000 కోట్ల అదనపు అమ్మకాలను సాధించాలి. అంటే 2026-27లో రూ.5000 కోట్లు, 2027-28లో రూ.10,000 కోట్లు, 2028-29లో రూ.15000 కోట్లు, 2029-30లో రూ.20,000 కోట్లు, 2030-31లో రూ.25,000 కోట్ల అదనపు విక్రయాలు అవసరం. కొత్త బ్రాండ్ అయితే, మనదేశంలో వార్షికంగా రూ.10,000 కోట్ల మొత్తం విక్రయాలను సాధించిన తర్వాతే ఈ పథక ప్రయోజనాలకు అర్హత ఉంటుంది. 2026-27, 2027-28 సంవత్సరాల్లో అర్హత కలిగిన విక్రయాలకు 2.75% ప్రోత్సాహకాలు ఇస్తారు. 2028-29, 2029-30 సంవత్సరాల్లో 2.50%, 2030-31లో 2.25% ప్రోత్సాహకం అందిస్తారు. డిస్‌ప్లే మాడ్యూళ్లు, బ్యాటరీలు, యూఎస్‌బీ కేబుల్ వంటి కీలక మొబైల్ విడిభాగాలను, మనదేశంలోనే స్థానికంగా సమీకరించే మొబైల్ కంపెనీలకు విక్రయాలపై అదనంగా 1.5% వరకు బోనస్ ఇన్సెంటివ్ లభిస్తుంది. ఈ పథకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. దీని నిర్వహణను ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ పర్యవేక్షిస్తుంది. మనదేశంలోనే పూర్తిగా రూపొందించిన - సొంత మేధోసంపత్తి హక్కులు కలిగిన సరికొత్త దేశీయ మొబైల్ ఫోన్లు, రాబోయే 10-14 నెలల్లో మార్కెట్‌లోకి రానున్నాయని అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఎంపీఎంఎస్ కింద దేశీయ బ్రాండ్లను ఎంపిక చేయడంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, విదేశీ ఫోన్లను కాపీ కొట్టే సంస్థలకు ఈ పథకంలో లబ్ధి చేకూరదని స్పష్టం చేశారు. ఎంపీఎంఎస్ పథకం ద్వారా వచ్చే అయిదేళ్లలో మొబైళ్ల ఉత్పత్తి విలువ దాదాపు రెట్టింపై రూ.39 లక్షల కోట్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ పథకం ద్వారా 60,000 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయి.

## బిజినెస్

### అమెరికాతో రూ.3800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం..!




ఇంటర్నెట్ డెస్క్: చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసును పరిష్కరించుకునేందుకు ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకొచ్చింది. ఇందుకుగాను ఆ దేశ న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,800 కోట్లు) చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తాన్ని రెండు దఫాలలో చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీంతో 2024లో దాఖలైన ఈ వ్యాజ్యం ముగిసింది. టిక్‌టాక్ తమతో రాజీ చేసుకోవడం దేశంలోని పిల్లలు, తల్లిదండ్రులకు ఒక పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం.. వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా యాప్‌లు గోప్యంగా ఉంచేలా పర్యవేక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు, పిల్లల కోసం ఉద్దేశించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా ఆధారిత మాతృ సంస్థ బైట్‌డాన్స్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ.. 2024లో న్యాయ శాఖ వ్యాజ్యం దాఖలు చేసింది. నాటి నుంచి టిక్‌టాక్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థ తన వాటాలను తగ్గించుకుంది. దీంతో కొత్త టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడానికి ఒరాకిల్ సిల్వర్ లేక్, ఎమిరేట్స్ పెట్టుబడి సంస్థ ఎంజీఎక్స్ వంటి ప్రధాన పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంది. పిల్లల భద్రత, గోప్యతపై సోషల్ మీడియా కంపెనీలు పెద్ద సంఖ్యలో వ్యాజ్యాలను ఎదుర్కొంటున్న తరుణంలో టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీ కుదుర్చుకోవడం గమనార్హం. మరోవైపు 1998 నాటి బాలల ఆన్‌లైన్ గోప్యతా పరిరక్షణ చట్టం (జుర్రాూ)తో పాటు.. వివిధ రాష్ట్ర చట్టాలను ఉల్లంఘించిందనే ఆరోపణలు రావడంతో ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా (వీమ్ఖ) సైతం కోర్టు విచారణలను ఎదుర్కొంటోంది.

### యాపిల్‌లో లేఆఫ్‌లు.. 'సిరి'పై ఎఫెక్ట్

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ దాదాపు 200 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. ఈ కోతలు ప్రధానంగా సిరి డిజిటల్ అసిస్టెంట్ విజన్ ప్రో హెడ్‌సెట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ విభాగాల్లో జరిగాయి. ఇందులో విజన్ ప్రో హార్డ్‌వేర్ విభాగం నుంచి దాదాపు 100 పోస్టులు, సిరి, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాల నుంచి మరో 100 పోస్టులను తొలగించినట్లు తెలుస్తోంది. విజన్ ప్రో కోసం గేమింగ్ ఫీచర్లను డెవలప్ చేస్తోన్న విభాగాన్ని కంపెనీ పూర్తిగా మూసివేసింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ మార్పులు చేస్తున్నట్లు యాపిల్ స్పష్టం చేసింది. అయితే, సంస్థలో కొత్త ఉద్యోగాలను సృష్టించడంతో పాటు.. ఈ లేఆఫ్స్ వల్ల నష్టపోయిన సిబ్బంది సంస్థలోని ఇతర విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొంది. యాపిల్ ప్రస్తుతం సిరి కోసం సరికొత్త ఏఐ ఆధారిత వెర్షన్‌ను డెవలప్ చేస్తోంది. దీనికి సాంకేతిక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది అవసరం కావడంతో, ప్రస్తుత బృందంలో మార్పులు చేపట్టింది. అలాగే యాపిల్ డివైజ్‌లలో ఏఐ ఫీచర్లను పర్యవేక్షించే ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ విభాగంలోనూ మార్పులు జరుగుతున్నట్లు సంస్థ తెలిపింది. మరోవైపు, విజన్ ప్రో కోసం ఇమ్మెర్సివ్ వీడియోలకు మిలియన్ డాలర్ల ఖర్చవుతోంది. కానీ దీని వినియోగదారుల సంఖ్య పరిమితంగా ఉండటంతో కంపెనీపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. అందుకే ఇకపై సొంతంగా నిర్మించే కంటెంట్‌ను తగ్గించి, ఇతర తయారీ సంస్థలను ప్రోత్సహించాలని యాపిల్ నిర్ణయించింది.

### జియో రీచార్జ్ ప్లాన్: 98 రోజులు అదిరిపోయే బెనిఫిట్స్!



మొబైల్ రీఛార్జ్ విషయంలో ఎక్కువ వ్యాలిడిటీతో పాటు రోజువారీ డేటా, అపరిమిత 5జీ, కాలింగ్, ఎస్ఎంఎస్, ఎంటర్‌టైన్‌మెంట్, ఏఐ సేవలు అందించే ప్లాన్లకు ప్రస్తుతం వినియోగదారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రిలయన్స్ జియో అందిస్తున్న రూ.999 ప్రీపెయిడ్ ప్లాన్ పలు ప్రయోజనాలతో ఆకట్టుకుంటోంది. ఒక్కసారి రీఛార్జ్ చేసుకుంటే 98 రోజుల పాటు సేవలు పొందొచ్చు.

**98 రోజుల వ్యాలిడిటీ.. 196 జీబీ డేటా**

రూ.999 ప్లాన్‌లో 98 రోజుల వ్యాలిడిటీతో ప్రతిరోజూ 2 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. అంటే మొత్తం వ్యాలిడిటీ కాలంలో 196 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. దీంతో పాటు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు అందిస్తారు. తరచూ రీఛార్జ్ చేసుకోవాల్సిన అవసరం లేకుండా దాదాపు మూడు నెలల పాటు ఈ సేవలను పొందవచ్చు. 5జీ స్మార్ట్‌ఫోన్‌తో పాటు జియో 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న ప్రాంతంలో ఉన్న వినియోగదారులకు ఈ ప్లాన్‌తో అపరిమిత 5జీ డేటా ప్రయోజనం లభిస్తుంది. 5జీ సేవలు అందుబాటులో లేకపోతే రోజువారీ 2 జీబీ హైస్పీడ్ డేటా వినియోగం పూర్తయ్యాక ఇంటర్నెట్ వేగం 64 కేబీపీఎస్‌కు తగ్గుతుంది.

**జియోహాట్‌స్టార్, గూగుల్ ఏఐ ప్రో**

ఈ ప్లాన్‌లో వినోదం కోసం జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తుంది. అంతేకాకుండా గూగుల్ ఏఐ ప్రో ప్రయోజనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో 5,000 జీబీ గూగుల్ క్లౌడ్ స్టోరేజ్, జెమిని ప్రో యాక్సెస్‌తో పాటు నానో బనానా సహా పలు ఏఐ ఫీచర్లను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జియో క్లౌడ్ ద్వారా అదనంగా 50 జీబీ క్లౌడ్ స్టోరేజ్ ప్రయోజనం కూడా లభిస్తుంది.

**సబ్‌స్క్రిప్షన్ కొనసాగాలంటే ఇదే కీలకం**

అయితే జియోహాట్‌స్టార్, గూగుల్ ఏఐ ప్రో ప్రీమియం ప్రయోజనాలకు కొన్ని షరతులు వర్తిస్తాయి. ఈ ప్రయోజనాలను యాక్టివ్‌గా కొనసాగించేందుకు తదుపరి నెలల్లో కనీసం రూ.349 లేదా అంతకంటే ఎక్కువ విలువైన జియో ప్రీపెయిడ్ రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే 98 రోజుల వ్యాలిడిటీ, 196 జీబీ డేటా, అపరిమిత కాలింగ్, 5జీ డేటాతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్, ఏఐ సేవలను ఒకే ప్లాన్‌లో కోరుకునే వారికి రూ.999 రీఛార్జ్ ఆసక్తికరమైన ఆప్షన్‌గా నిలుస్తోంది.

# ఆరేసిన స్టార్క్, ఇస్లామ్.. తొలి రోజే కూలిన 18 వికెట్లు



**మాకే:** ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజే 18 వికెట్లు పడ్డాయి. తొలుత బంగ్లాదేశ్ 64 పరుగులకే ఆలౌట్ అవ్వగా, ఇక ఆస్ట్రేలియా కూడా ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 165 రన్స్ చేసింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ప్రస్తుతం 101 పరుగుల ఆధిక్యంతో ఆస్ట్రేలియా ఉన్నది. ఇవాళ ఉదయం టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ముందుగా బౌలింగ్ ఎంచుకున్నది. ప్యాట్ కమ్మిన్స్ డిసెషన్‌కు తగినట్లుగా ఓపెనింగ్ బౌలర్ మిచెల్ స్టార్క్ చెలరేగిపోయాడు. తొలి బంతికే షాద్‌మాన్ ఇస్లామ్ వికెట్ తీశాడు. అదే ఊపులో బౌలింగ్ చేసిన స్టార్క్ 10 ఓవర్లలో 12 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు.

ఇక ఆస్ట్రేలియా బ్యాటర్లు కూడా మాకే పిచ్‌పై తడబడ్డారు. బంగ్లాదేశ్ బౌలర్ షోరిఫుల్ ఇస్లామ్ నిప్పులు చెరిగాడు. అతను 35 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 8 వికెట్లు కోల్పోయి 165 రన్స్ చేసింది. ఆసీస్ బ్యాటర్ కెమరూన్ గ్రీన్ ఒక్కడే హాఫ్ సెంచరీ చేశాడు. 51 రన్స్‌తో అతను ఇంకా క్రీజ్‌లో ఉన్నాడు. డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా దారుణంగా ఓడిపోయిన విషయం తెలిసిందే. అయితే ఆటగాళ్లను మార్చాలని వత్తిడి వచ్చినా.. కేవలం ఒక్క ప్లేయర్‌ను మాత్రమే మార్చారు. బంగ్లాదేశ్‌తో సిరీస్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికా, ఇండియా, ఇంగ్లండ్‌లో ఆస్ట్రేలియా టూర్ చేయనున్నది.

## స్పోర్ట్స్

### ముంబై ఇండియన్స్‌లో కీలక నియామకం



ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ తమ క్రికెట్ వ్యవస్థలో కీలక మార్పు చేసింది. మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్, ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో విశేష అనుభవం కలిగిన జుబిన్ భరూచాను డైరెక్టర్ ఆఫ్ పెర్ఫార్మెన్స్‌గా నియమించింది. ముంబై ఇండియన్స్‌కు చెందిన బహుళ విభాగాల నాయకత్వం, సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి భరూచా పనిచేయనున్నారు. ఆటగాళ్ల అభివృద్ధి, పెర్ఫార్మెన్స్ ప్రోగ్రామ్‌లు, దీర్ఘకాలిక ప్రణాళికలను మరింత బలోపేతం చేయడం ఆయన ప్రధాన బాధ్యతలుగా ఉండనున్నాయి. ముంబైకి చెందిన మాజీ ఫస్ట్‌క్లాస్ బ్యాటర్ అయిన భరూచా గతంలో రాజస్థాన్ రాయల్స్ క్రికెట్ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా యువ ప్రతిభను గుర్తించడం, వారికి హై-పెర్ఫార్మెన్స్ స్థాయిలో శిక్షణ అందించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. భారత క్రికెట్‌లో ప్రస్తుతం స్టార్ హోదా అనుభవిస్తున్న సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, వైభవ్ సూర్యవంశీ ఎదుగుదలలో భరూచా కీలకంగా వ్యవహరించారు. ముంబై ఇండియన్స్ తమ క్రికెట్ ఎకోసిస్టమ్‌లో ప్రతిభను గుర్తించి, దాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే విధానంపై దృష్టి పెడుతున్న నేపథ్యంలో భరూచా నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. యువ ఆటగాళ్ల అభివృద్ధితో పాటు ప్రస్తుత జట్టు ప్రదర్శనను మరింత మెరుగుపరచడంలో ఆయన అనుభవం ఉపయోగపడే అవకాశం ఉంది.

### ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్.. గాయత్రి గోపీచంద్-ట్రీసా జోడీకి కాంస్యం




**దిల్లీ:** ఇటీవలే అర్జున పురస్కారాలకు ఎంపికైన భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్స్‌లో గాయత్రి జోడీ 21-18, 13-21, 8-21తో లియు షెంగ్షు, టాన్ నింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ పోరాడి గెలిచిన భారత ద్వయం తర్వాత రెండు గేమ్‌లను చేజార్చుకుంది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్ ఆరంభంలో భారత జోడీ 4-1 ఆధిక్యంలో నిలిచింది. తర్వాత చైనా ద్వయం దూకుడుగా ఆడి 7-7తో స్కోరును సమం చేసింది. తర్వాత పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. ఈ క్రమంలో ట్రీసా, గాయత్రి 16-18తో వెనుకబడినా.. గొప్పగా పుంజుకుని గేమ్‌ను గెల్చుకున్నారు. రెండో గేమ్‌లో చైనా జోడీ దూకుడు ప్రదర్శించి 5-2తో నిలిచినా భారత జోడీ పుంజుకుని 11-10తో ఆధిక్యంలోని నిలిచింది. తర్వాత లియు షెంగ్షు, టాన్ నింగ్ దూకుడు పెంచి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హవా అంతా చైనా జోడీదే. భారత ద్వయం కనీస పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో ట్రీసా, గాయత్రి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు.



## గట్టి కమ్ బ్యాక్ ఇచ్చిన రవితేజ..

టాలీవుడ్‌లో తనదైన మాస్ స్టైల్, ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోల్లో మాస్ మహారాజ్ రవితేజ ఒకరు. ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టి, తన కష్టంతో స్టార్ హీరోగా ఎదిగిన రవితేజ.. ఒకప్పుడు వరుస విజయాలతో టాలీవుడ్ బాక్సాఫీస్‌ను శాసించారు. తనదైన కామెడీ టైమింగ్, మాస్ డైలాగ్స్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులకు ఎంతగానో చేరువయ్యారు. అయితే ప్రతి హీరో కెరీర్‌లోనూ ఎత్తుపల్లాలు ఉండటం సహజం. రవితేజ కెరీర్‌లో కూడా కొంతకాలం గడ్డు పరిస్థితి ఎదురైంది. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆయన మార్కెట్‌పై ప్రభావం పడింది. ముఖ్యంగా భారీ అంచనాలతో విడుదలైన 'కిక్ 2' తర్వాత రవితేజ కెరీర్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయని సినీ విశ్లేషకులు భావిస్తుంటారు.రవితేజ కెరీర్‌లో భారీ హైప్‌తో వచ్చిన చిత్రాల్లో 'కిక్ 2' ఒకటి. 'కిక్' లాంటి సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే విడుదల తర్వాత సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా తర్వాత రవితేజకు ఒకటీ రెండు విజయాలు దక్కినప్పటికీ, ఆయన సినిమాలపై న్యూట్రల్ ఆడియెన్స్‌లో గతంలో ఉన్నంత ఆసక్తి కనిపించలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.దీంతో ఒకప్పుడు రవితేజ సినిమా అంటే థియేటర్లకు పరుగులు పెట్టిన ప్రేక్షకుల్లో కొంత దూరం ఏర్పడింది. వరుసగా వచ్చిన కొన్ని ఫలితాలు కూడా ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపించాయి.

## విశ్వంభర నుంచి పవర్‌ఫుల్ పోస్టర్



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రముఖ స్టూడియోలు వీఎఫ్ఎక్స్ పనులను పూర్తి చేస్తున్నాయి. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ 'విశ్వంభర' నుంచి స్పెషల్ పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్‌ట్రాక్ను విడుదల చేశారు. పోస్టర్‌లో చిరంజీవి ఫెరోషియస్ లుక్ ఆకట్టుకుంటోంది. ఆయన ఇంటెన్స్ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు మెటాలిక్ త్రిశూలం మరింత పవర్‌ను తీసుకొచ్చింది. ఈ లుక్ సినిమాలోని దైవత్వం, వీరత్వంతో కూడిన ప్రపంచాన్ని ప్రజెంట్ చేస్తోంది. మరోవైపు సెన్సేషనల్ కంపోజర్ గౌర హరి అందించిన OST పోస్టర్‌కు మరింత ఇంటెన్సిటీని జోడించింది. 'హనుమాన్', 'మిరాయ్' చిత్రాలకు సంగీతం అందించిన గౌర హరి.. పవర్‌ఫుల్ పెర్కషన్, చాంట్స్, డ్రమాటిక్ బ్రాస్ అరేంజ్‌మెంట్స్‌తో ఈ OSTను రూపొందించారు. మిస్టీరియస్ వాతావరణంతో ప్రారంభమయ్యే OST.. ఆ తర్వాత హై ఎనర్జీ మ్యూజికల్ ఎక్స్‌ప్లోషన్‌గా మారుతుంది. డివోషనల్ ఎలిమెంట్స్, హీరోయిక్ ఎనర్జీ కలిసిన విధానం చిరంజీవి పాత్ర చుట్టూ ఒక పవర్‌ఫుల్ ఆరాను క్రియేట్ చేస్తోంది.



## నవ్వుల పూల వర్షం కురిపించే ముగ్గురు కోతులు..



జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో, స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో వస్తోన్న సరికొత్త చిత్రం 'ముగ్గురు కోతులు'. శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ చిత్రంలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ హీరోలుగా నటిస్తుండగా, వర్షిక పాశం కథానాయికగా మెరవనున్నారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా విభిన్నంగా డిజైన్ చేయబడింది. పోస్టర్‌లో ముగ్గురు హీరోలు విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో కనిపించి నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు పంచడం ఖాయమని ఫస్ట్ లుక్ చూస్తేనే అర్థమవుతోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సాంకేతిక నిపుణుల బృందం బలంగా నిలిచింది. ఎస్. సుహాస్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుండగా, రాజ్ నోముల సినిమాటోగ్రఫీ విజువల్స్ పరంగా అద్భుతంగా ఉండబోతున్నాయని తెలుస్తోంది. అలాగే జమీర్ షేక్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, పీఆర్వోగా సాయి సతీష్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



## స్పిరిట్ సినిమా వివాదంపై పోస్ట్..

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'స్పిరిట్' (Spirit) నుంచి హీరోయిన్ దీపికా పదుకొనే తప్పుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై సందీప్ రెడ్డి వంగా సోదరుడు, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. దీపికా పదుకొనే రెమ్యునరేషన్‌తో పాటు సినిమాలో 10 శాతం లాభాల వాటా అడగడం వలనే బడ్జెట్ లెక్కలు కుదరక ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వెల్లడించారు. అంతేకాకుండా ఆమె షూటింగ్ వేళల విషయంలో కొన్ని షరతులు పెట్టారని, ఈ కారణంగానే విభేదాలు తలెత్తాయని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ఒక జర్నలిస్ట్ స్పందిస్తూ.. కేవలం మహిళా నటీనటులు ప్రాఫిట్ షేరింగ్ అడిగితేనే విమర్శలు చేస్తారా? ఎంతో మంది హీరోలు ఏళ్ల తరబడి ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు కదా అంటూ ఒక పోస్ట్ షేర్ చేశారు. అయితే ఈ పోస్ట్‌ను దీపికా పదుకొనే లైక్ చెయడం ద్వారా తన వాదనకు మద్దతు తెలిపారు.గతంలో కూడా దీపికా పదుకొనే ఎనిమిది గంటల పని వేళల డిమాండ్ వివాదంపై మాట్లాడుతూ, పురుష నటులు కూడా ఇలాంటి షరతులతో పనిచేస్తున్నప్పటికీ తనను మాత్రమే టార్గెట్ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ వివాదం తర్వాత ఈ చిత్రంలో దీపిక స్థానంలో త్రిప్తి డిమ్రిని హీరోయిన్‌గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమా 2027 మార్చి 5న విడుదల కానుంది. మరోవైపు దీపికా పదుకొనే షారుఖ్ ఖాన్‌తో కలిసి 'కింగ్', అల్లు అర్జున్ – అట్లీ కాంబినేషన్‌లో రాబోయే 'రాకా' సినిమాలతో బిజీగా ఉన్నారు.

Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**